"అక్రూరుడు" ఎవరండీ అన్నాను ఇడ్లీ లోకి నెయ్యి వేస్తూ "క్రూరుడు కానివాడు అక్రూరుడు. న్యాయము, అన్యాయము అంటారు చూడు అలాగే క్రూరుడు, అక్రూరుడు" అన్నారు మా హోఫ్‌గారు.

"ఉదయాన్నే తెలుగులో వార్తలతో వేడి వేడి ఇడ్లీలు లాగించెయ్యక 'అక్రూరుడు ఎవరు?' అన్న సమస్య మీద రీసెర్చ్ మొదలుపెట్టావేమిటి! అక్రూరుడు నవల టైటిలా కొంపతీసి? వేడి చల్లారకుండా ఇడ్లీలు తినేయి. అక్రూరుడు వాడంతట వాడే బయటకు వస్తాడు" అనేశారు వేళాకోళంగా. ఇంట్లో నాన్ కోపరేషన్ మూలంగానే నాకు జ్ఞానపీఠ్ అవార్డ్ తప్పిపోతూంది. కాస్త నామీద వయసులో పెద్ద కదా! ఏమన్నా ఇంటెలిజెన్స్ వుండకపోతుందా అనే అనుమానంతో అడుగుతూ వుంటాను. కాని జీరో అయిపోతూ వుంటారు. (జీరో వాల్ట్ బల్బు కరెంట్ తక్కువ కాల్చును. కనుక లాభమే అంటారు ఆయన). అక్రూరుడు రథసారథి అని చదివినట్లు గుర్తు. రథసారథి ఎవరికి? పార్థసారథికేనా! అవా నీ డవుట్. నా డవుట్ అవుట్ అయిందంటే నాకన్న చేయి విరిగిన రచయిత్రులు ఈ సబ్జెక్ట్ మీద పేజీలకు పేజీలు వ్రాసి విరగబడిపోతారు. దానితో నాకన్నా ముందస్తుగా జ్ఞానపీఠ్ అవార్డ్ వాళ్ళే కొట్టేస్తారు-అని నా మనసులోని బెంగని గుర్తించరు మావాళ్లు. అక్రూరుడు అంటే క్రూరుడు కానివాడు అని మా "హోఫ్"గారు సెలవిచ్చారుగదా! నాకు దానితో కొంచెం ఆలోచన సెలవీయడం మొదలెట్టింది.

క్రూరుడు కానివాడు అక్రూరుడు. అయితే క్రూరుడు అని ఎవరయినా పేరు పెట్టుకుంటారా! లేక క్రూరుడువల్ల పుట్టిన బిడ్డ అక్రూరుడు అవుతాడా! కన్యకు పుట్టిన బిడ్డ అకన్య అవుతుందా, లేక సుకన్య అవుతుందా! (బిడ్డ పుట్టిన తరువాత కన్య అవదు కదా! అమ్మవుతుంది) క్రూరత్వంవల్ల పుట్టిన బిడ్డ అక్రూరుడు అయి వుంటాడు. ఇన్ని కోట్ల ఆడ మగ జనాభాలో ఒక ఆడకి మగ, ఒక మగకి ఆడ దొరకకపోతారా! క్రూరత్వానికి బలయిన అకన్యలు తమ పిల్లలని అక్రూరుల్లని చేయక్కర్లేదు. మనం కన్న పిల్లల్ని మనం బతికుండగానే అనాథలని చేయడమేమిటి! తండ్రి లేకపోయినా ఫరవాలేదు...కాని పసి పిల్లల మొదటి



పిలుపు అమ్మా అనే పిలుపుని అందుకోవడానికి భయమెందుకు! అమ్మలేని పిల్లలు ఈ భారతావనిలో వుండడానికి వీలు లేదు. నేను అవివాహిత మాతలని సమర్థించానని తెలుస్తే మా "డా.రా.కు"గారు ఆమె స్నేహిత వర్గంలోంచి నన్ను సస్పెండ్ చేయవచ్చును. అయినా నేను నా కాలాన్ని స్పెండ్ చేయగలను. ఆడదాన్ని తల్లిగా గౌరవించాలి. ఎవరో క్రూరులు ఆడదానితో అవివేకంగా ప్రవర్తించితే, మిగిలిన సగటు జనాభా అంతా చెవులు కొరుక్కోవడం మానాలి. అలా చెవులు కొరికేసుకుంటే మనకే నష్టం. (చెవుల్లేకపోతే రకరకాల లోలక్కులు, (లవ్ లాక్‌లు అవి) రవ్వల దుద్దులు ఎల్లా ధరించుతాము?" మనం మనం స్త్రీలందరం. మనలో 'అకన్యలు, అమాతలు' ఎవరూ లేరు అని నిరూపించాలి. ఎక్కడ చూసినా దారి దోపిడీలు, మానభంగాలు, ఆత్మహత్యలు-ఇవన్నీ మన స్త్రీ జన జీవితాన్ని అగాధాల్లోకి తోసేస్తున్నాయి. స్త్రీలంతా ఎప్పుడో ఒకప్పుడు ఎవరికో ఒకరికి తల్లి అయి వుంటుంది. కనుక ప్రతి స్త్రీని మనం తల్లిగా చూడాలి. చీకటి కోణాలు వెతక్కూడదు. తెలుగు తల్లికి నా ప్రాణాలు ధారపోసయినా, రక్తం చిందించి అయినా ఈ గడ్డ మీద ప్రతి పిల్లకూ తల్లి-తండ్రి వుండేట్లు చేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. అసలు తల్లి-తండ్రి లేకుండా ఎవరూ పుట్టకూడదు" అన్నాను.

"అలా ఎవరు పుట్టారు?!" అన్నారు హోఫ్‌గారు.

"అబ్బే. అదేం లేదు" అంటూ ఈ స్కెచ్‌ని స్థాపించాను—

—ఐ.వి.ఎస్. అచ్యుతవల్లి

### ఇద్దరూ అందగత్తెలే!

ఫోటోలో కనిపించే అందాల సుందరి మిస్ బ్రిటన్. ఆమెతో పాటు వున్న కుక్క కూడా అందాల పోటీలో ఎన్నికైందే. ఒక్యా లెండల్ కంపెనీ వాళ్ళు ఈ ఇద్దరినీ తమ క్యాలెండర్ కోసం ఓ చోట చేర్చారు. ఆ కుక్క వయస్సు నాలుగేళ్ళు. 3,000 కుక్కలను పరిశీలించి దీన్ని విజేతగా ప్రకటించారు.

— ఎమ్.

